మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన సత్యవతి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : శాసన మండలిలో బీఆర్ఎస్ విప్‌గా నియామకమైన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యవతిరాథోడ్

నెహ్రూనాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

నెహ్రూనాయక్‌కు పరామర్శ

కురవి, ఫిబ్రవరి 6 : కురవి మండలం నేరడ శివారు కాకులబోడుతండా(కీమాతండా)కు చెందిన మహబూబాబాద్ మాజీ సర్పంచ్ భూక్యా నెహ్రూనాయక్ మాతృమూర్తి భూక్యా లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు నెహ్రూనాయక్‌ను పరామర్శించారు. ఆమె చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఎడ్ల వేణు, మంగళంపల్లి కన్న పాల్గొన్నారు.

చిన్నారి ఆపరేషన్‌కు రు.50వేల సాయం

ఇన్‌స్టాగ్రామ్ యువకుడు రఘు ఆధ్వర్యంలో..

కురవి, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రానికి చెందిన నిరుపేద దార వినోద్‌కుమార్ కుమార్తె 4 సంవత్సరాల వయసు గల విశ్రుతప్రియాన్సి పుట్టిన అప్పటి నుంచి సికిల్‌సెల్ అనీమియా, కిడ్నీ రిఫెలెక్షన్, కిడ్నీలో రాళ్లు తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నది. విషయం తెలుసుకున్న కురవి మండల కేంద్రానికి చెందిన ఇన్‌స్టాగ్రామ్ యువకుడు గంగరబోయిన రఘు చిన్నారి అవస్థత వివరిస్తూ చేసిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయగా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు దాతలు ఇప్పటికే ఆర్థిక సాయం అందించారు. గురువారం హైదరాబాద్‌లో ఉంటున్న వక్ఫ్‌బోర్డు సభ్యుడు, క్లాసిక్ హోమ్ నీడ్స్ యజమాని మహమ్మద్ షకీల్ స్వయంగా మహబూబాబాద్‌కు వచ్చి చిన్నారి కుటుంబ సభ్యులను కలిసి ఆపరేషన్ నిమిత్తం రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. బాలిక కుటుంబసభ్యులు దాతతోపాటు ఇన్‌స్టాగ్రామ్ యువకుడు రఘుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు, చిత్రంలో రఘు

వెదజల్లే విధానంతో అధిక దిగుబడి

గార్ల, ఫిబ్రవరి 6: వెదజల్లే విధానంలో వరి పంట సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చని ఏవో రామారావు అన్నారు. గురువారం మండలంలోని పుల్లూరులో జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా సాగు చేసిన వెదజల్లే పద్ధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పంటకు జంక్ లోపం ఉన్నట్లు గురించారు. నివారణకు కార్డాప్ హైడ్రో క్లోరైడ్ లీటరు నీటికి 2 గ్రాములు జింక్ సల్ఫేట్ కానీ, ఏంట్రాకాల లేదా జెడ్ 78 కలిపి పిచికారీ చేయాలన్నారు.

వెదజల్లే పద్ధతిని పరిశీలిస్తున్న ఏవో రామారావు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUILDING FOR SALE
★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact: 9949912347, 999896 12347, 63025 53816.**
NTW-332462

WANTED
★శ్రీ ఆర్ముఖ బార్ & రెస్టారెంట్ కరీమాబాద్ యందు పనిచేయుటకు వర్కర్లు వెంటనే కావలెను. సంప్రదించగలరు. సెల్ : 8019803598.
NTW-326593

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మసివాగు లూటీ

- రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు
- గ్రామాల్లోనే నిల్వ, పట్టించుకోని అధికారులు

మసివాగులో ఇసుక తవ్వకాలు జరిపిన ప్రాంతం

బయ్యారం, ఫిబ్రవరి 6 : ఏజెన్సీలోని సుద్దరేవు సమీపంలో ఉన్న మసివాగును కొందరు లూటీ చేస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయినా, అధికారులు పట్టించుకోవడం లేదు. వేసవికాలం కావడంతో వాగులోని నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడం ఇసుక రవాణాకు అనువుగా మారింది. దీంతో ఏజెన్సీ గ్రామాల్లోని కొందరు ఇసుక వ్యాపారుల కన్ను మసివాగుపై పడింది. వాగు సమీపంలోని కొయ్యగూడెం, చుంచుబంధం తండా, సుద్దరేవు, కాచనపల్లి, కిష్టాపురం గ్రామాలకు చెందిన కొన్ని ట్రాక్టర్లు నిత్యం వాగు నుంచి పదుల సంఖ్యలో ఇసుక ట్రిప్పులను మండలంలోని పలు గ్రామాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.3వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వాగు నుంచి తరలించిన ఇసుకను కుప్పలు కుప్పలుగా గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో డంపు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పెద్దఎత్తున ఇసుక నిల్వలు ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేకున్నా పట్టపగలే యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నది. అధికారులు స్పందించి ఇసుక తరలింపును ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

డయాలసిస్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

ఆరోగ్య సేవలను అడిగితెలుసుకుంటున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ పేషెంట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ డాక్టర్లకు సూచించారు. గురువారం ఆయన ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆర్బీఎస్‌కే సేవలు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తొర్రూరులో డయాలసిస్ మిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాల రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్, హర్షవర్దన్, పాల్గొన్నారు.

క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించాలి

జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ..రెండు వారాలుగా దగ్గు ఉన్న వారికి వెంటనే తెమడ పరీక్షలను నిర్వహించాలని, ప్రతి నెలా స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేసి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆశ కార్యకర్త ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్, శ్రావణ్, రాజు పాల్గొన్నారు.

బంజార సాంస్కృతిక సమ్మేళనంలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

ఘనంగా బంజార సమ్మేళనం

మరిపెడ, ఫిబ్రవరి 6 : బంజార సంస్కృతిని కాపాడుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆడిటోరియంలో గురువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బంజార సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ సంస్కృతిలో బంజారాల సంస్కృతి ఒక భాగమని, కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. అనంతరం ఆడిటోరియంలో నిర్వహించిన జానపద, లంబాడా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్టేట్ జెండర్ కో ఆర్డినేటర్ హాజారి శిరీష, జిల్లా జెండర్ కో ఆర్డినేటర్ విజయకుమారి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, మండల రెవెన్యూ అధికారి సైదులు, డాక్టర్ రవి, మండల విద్యాధికారి అనితాదేవి పాల్గొన్నారు. కాగా, మరిపెడలో బంజారా సాంస్కతిక సమ్మేళనానికి విచ్చేసిన డీఈవోను పీఆర్టీయూ మండల శాఖ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మహేశ్, గౌరవ అధ్యక్షుడు అర్జున్‌నాయక్, జిల్లా బాధ్యులు నగేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

ఉక్కు పరిశ్రమను సాధించే వరకు పోరాటం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : బయ్యారంలో ఉక్కు పరిశ్రమ సాధించే వరకు పోరాటం చేయాలని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యు జీనాగయ్య అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్లు చెల్లించే ప్రత్యక్ష పన్నులను తగ్గించి, మధ్యతరగతి వర్గాలు చెల్లించే పరోక్ష పన్నులను పెంచినట్లు తెలిపారు. బడ్జెట్‌లో రాష్ర్టానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, బయ్యారంలో ఉక్కు సహజ వనరుల్లో నాణ్యత లేదని కేంద్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదన్నారు. రానున్న కేంద్ర బడ్జెట్ రీజియన్ సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ బలరాంనాయక్‌కు మాట్లాడి రాష్ర్టానికి అధికంగా ఎంపీల నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సూర్ణపు సోమయ్య, రాజన్న, శెట్టి వెంకన్న, వీరన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మొక్కలను నాటుతున్న విద్యార్థులు

ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతి సమతుల్యతను కాపాడాలని కేంద్రియ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ముఖేశ్‌కుమార్ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ఆయన విద్యార్థులతో మొక్కలు నాటించి మాట్లాడారు. ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటడం ద్వారా వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గుతుందని, ప్రకృతి వైపరీత్యాల నుంచి మానువుడు రక్షించబడుతాడని అన్నారు. కార్యక్రమంలో టీచర్లు నితీశ్‌కుమార్, ఇమాముద్దీన్, మహ్మద్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయంలో దళితుల ప్రత్యేక పూజలు

నర్సింహులపేట, ఫిబ్రవరి 6: జయపురం గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి రంగులు వేసే విషయంలో దళితులను అవమానించారని బుధవారం తహసీల్దార్ నాగరాజు, పోలీసులకు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం వత హసీల్దార్ నాగరాజు, ఎస్సై సురేశ్ గ్రామంలో విచారణ చేట్టారు. దళితులను చిన్నచూపు చూడొద్దని, మానవులంతా సమానమేనని చెప్పారు. వేణుగోపాలస్వామి దేవాలయంలోకి దళితులతో ప్రవేశం చేయించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్, ఆయల కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డితోపాటు దళిత సంఘాల నాయకులు, ప్రజలు ఉన్నారు.

పెద్దవంగర కేజీబీవీలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుమాధవ్

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధవహించాలి

ఎంపీడీవో వేణుమాధవ్

పెద్దవంగర, ఫిబ్రవరి 6 : ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధవహించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. గురువారం చిన్నవంగరలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంట గదులు, స్టడీరూమ్, స్టాక్ రిజిస్టర్, విద్యార్థులు, ఉపాధ్యాయుల, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రికి డిన్నర్ రుచికరంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వంటలు సిద్ధం చేసే సిబ్బంది శుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ప్రతి సబ్జెక్ట్‌లో ప్రతిభ కనబరిచేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో స్రవంతి, పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.

డోర్నకల్: పట్టుబడిన బెల్లంపానకం డ్రమ్ములతో ఎక్సైజ్ పోలీసులు

గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్ : మండలంలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు చేశారు. ఎక్సైజ్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని హూన్యతండా, బోడహత్యా తండాలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. 46 లీటర్లు గుడుంబా, 250కిలోల నల్లబెల్లం, వెయ్యి లీటర్లు బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, బైక్‌ను సీజ్ చేశారు. పదిమందిపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దాడుల్లో ఎస్సై అశోక్, కీరిటీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో..

ఇనుగుర్తి : లాలుతండాలో గూడూరు ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరి, కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్ ఆధ్వర్యంలో గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించా రు. 600లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 20 లీటర్ల గుడుంబా, 20కిలోల బెల్లం, రెండు కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గుడుంబా అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలేరులో రైస్‌మిల్లుపై దాడులు

- 105 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం, 6 ఏ కేసు నమోదు
- కేసముద్రం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలింపు
- సివిల్ సప్లయ్ ఏసీఎస్‌వో రమేశ్

నెల్లికుదురు, ఫిబ్రవరి 6 : నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలో రాజరాజేశ్వరి రైస్‌మిల్లులో సివిల్ సప్లయ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. 105 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. సివిల్ సప్లయ్ ఏసీఎస్‌వో రమేశ్ కథనం ప్రకారం... మండలంలోని వివిధ గ్రామాల్లో తెల్ల రేషన్‌కార్డు దారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రాజరాజేశ్వరి రైస్ మిల్లులో నిల్వ చేసి, వాటినే రీసైకిల్ చేస్తున్నారనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించారు. రైస్‌మిల్లులో 105 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరకకగా, వాటిని సీజ్ చేసి కేసముద్రం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని మిల్లులో నిల్వ చేసినందుకు మిల్లు యాజమాన్యంపై 6(ఏ) కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు రాకేశ్, అనిల్ ఉన్నారు.

ఆలేరులోని రాజరాజేశ్వరి రైస్‌మిల్లులో సీజ్ చేసిన రేషన్ బియ్యం

పంటల వివరాలు నమోదు చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : గ్రామాల్లో పంట సాగు వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఏడీఏ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ముడుపుగల్, శనిగపురం గ్రామాల్లో ఏఈవో సాయిప్రకాశ్ సర్వే తీరును పరిశీలించి మాట్లాడారు. యాసంగిలో రైతులు సాగు చేసిన పంటలను సర్వే నంబర్ల వారీగా పంటను నమోదు చేసి డీసీఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీని ద్వారా కచ్చితమైన వివరాలు నమోదవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : కల్యాణలక్ష్మి పథకంలో అవినీతికి పాల్పడిన ప్రభుత్వ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని తొర్రూరు మండలం కర్కాల గ్రామానికి చెందిన సంకినేని సురేశ్ అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020 సంవత్సరంలో తొర్రూరు మండలం కర్కాల గ్రామంలో కల్యాణలక్ష్మి పథకం డబ్బుల కోసం ఫేక్ మ్యారేజ్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేయగా, అధికారులతో డబ్బులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గతంలో కూడా అధికారులపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పూర్తి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

మహబూబాబాద్ రూరల్ : ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడారు. ఈ– కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మోడల్ స్కూల్, గురుకుల టీచర్లుకు 010 ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, ఉపేందర్, హుస్సేన్, విష్ణువర్ధన్, సంజీవ, రవి కుమార్, కృష్ణయ్య పాల్గొన్నారు.

భార్య, కొడుకుపై హత్యాయత్నం

డోర్నకల్, ఫిబ్రవరి 6 : కట్టుకున్న భర్త అనుమానంతో భార్య, కొడుకుపై డీజిల్‌తో దాడి చేసిన ఘటన గురువారం పెరుమాండ్లసంకీస గ్రామంలో జరిగింది. సీఐ రాజేశ్ కథనం ప్రకారం.. పెరుమాండ్లసంకీస గ్రామానికి చెందిన నీరుడి మహేశ్ అదే గ్రామానికి చెందిన శిరీషను 2017లో పెండ్లి చేసుకున్నాడు. ఏడు సంవత్సరాలపాటు వీరి కాపురం సజావుగానే నడిచింది. ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఇటీవల భర్త మహేశ్ భార్య శిరీషను అనుమానిస్తూ గొడవ పడి కొడుతున్నాడు. ఐదు రోజుల క్రితం శిరీషను కొట్టడంతో తల్లిగారింటికి వెళ్లింది. దీంతో మహేశ్ బుధవారం ఉదయం బాటిల్‌లో డీజిల్‌తో వెళ్లి శిరిషపై పోసి నిప్పుపెట్టేక్రమంలో స్థానికులు చూసి కాపాడారు. తర్వాత తన పెద్ద కొడుకు రిషిక్‌పై కూడా బాటిల్‌లో డీజిల్ తీసుకొచ్చి పోసి చంపడానికి ప్రయత్నించగా, చుట్టు పక్కల వారు మహేశ్‌తో గొడవ పడి వెళ్లగొట్టారు. శిరీష ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నర్సింగ్ హోమ్ లైసెన్స్ రద్దు చేయాలి

తొర్రూరు ఫిబ్రవరి 6 : 9వ తరగతి విద్యార్థి సిద్ధార్థ (కంఠాయపాలెం గ్రామం) మృతికి కారణమైన పట్టణంలోని బాలాజీ నర్సింగ్ హోమ్ లైసెన్స్ రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్లు బాలుడికి ఎక్కువ డోస్ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల శ్వాస ఆడక మృతి చెందాడని అన్నారు. ఇది నిర్లక్ష్యానికి నిదర్శనమని, దవాఖాన యాజమాన్యంపై కేసు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా సిద్ధార్థ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ సభ్యులు సిద్ధు, వినేశ్, ప్రకాశ్, కృష్ణ, ప్రమోద్, వంశీ, అభిలాష్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాలి

ఎస్సీ వర్గీకరణ కాకుండా, రిజర్వేషన్లను పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి యశోద భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మాల మహానాడు సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మహేశ్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కాకుండా, దళితుల రిజర్వేషన్లు పెంచేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా యువజన నాయకుడు ఎనమాల రాకేశ్, నెల్లికుదురు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, చిట్టిమల్ల కిరణ్, సుధాకర్ పాల్గొన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

మరిపెడ, ఫిబ్రవరి 6 : బావిలో పడి మధ్యప్రదేశ్ రాష్ర్టానికి చెందిన ఒకరు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని లూనావత్ తండాలో జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. మిర్చి తోటలో పని చేయడానికి వచ్చిన మధ్యప్రదేశ్ రాష్ర్టానికి చెందిన నితీశ్(20) బుధవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రిజర్వేషన్ శాతం పెంచాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : మాదిగ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతం పెంచాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కోండ్ర ఎల్లయ్య అన్నారు. గురువారం పట్టణంలోని కేటీఆర్ నగర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాటఇచ్చిన రేవంత్‌రెడ్డి కొందరు స్వార్థపరులు మాటలను విని రిజర్వేషన్ శాతాన్ని తగ్గించడం సరికాదన్నారు. మాదిగలకు 11శాతం రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం ఆగదన్నారు. ప్రభుత్వం కావాలనే లక్ష డప్పులు, వేల గొంతులు సభకు అనుమతి ఇవ్వలేదని, అవసరమైతే కోర్టు ద్వారా అనుమతి తీసుకొని సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీను, బాలరాజు, సతీశ్, రాజు, రాధా, ఎల్లయ్య పాల్గొన్నారు.

పీడిత ప్రజల పక్షపాతి యాదగిరి

తొర్రూరు, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి పీడిత ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేసిన కర్నాటి యాదగిరి మృతి తీరని లోటని సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజాపంథా నేత, నిజామాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఈ నెల 4 నుంచి 10 వరకు సంతాప సభలు నిర్వహిస్తున్నారు.ఈ మేరకు తొర్రూరు మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం వద్ద యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 17న నిజామాబాద్‌లో జరిగే జరిగే రాష్ట్ర సంతాప సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, సంయుక్త మండలాల నాయకులు సిగ్గేమ్ యాకయ్య, జక్కుల యాక య్య, తోట రవీందర్, వెంకన్న, మాచర్ల మురళి, సోమనర్సయ్య పాల్గొన్నారు.

గీత కార్మికుల అభివృద్ధికి సహకరించాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 6: గీతవృతి మీదే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కల్లుగీత కార్మికుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కర్యవర్గ సభ్యుడు గుండగాని లింగయ్య, కొత్త అంతయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 19న మండల కేంద్రంలో అన్ని గ్రామాల కల్లుగీత కార్మికులతో సమవేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో తండా చిన్నరాములు, కొమురెల్లి, చీకటి ఉప్పలయ్య, వెంకటనారాయణ, రేసు భిక్షం, మత్తు, శ్రీను, శ్రీరాములు, రాములు, వీరయ్య, అవిలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇనుగుర్తి, ఫిబ్రవరి 6 : చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్ సూచించారు. మండలంలోని కోమటిపల్లిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ శిక్ష తప్పదన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.